క్లుప్తంగా

అంగన్‌వాడీ ఆయాలకు నియామక పత్రాలు

ప్రొద్దుటూరు : ఐసీడీఎస్ ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టుకు సంబంధించిన అంగన్‌వాడీ ఆయాలకు ఇంటర్వ్యూలు ఇటీవల ముగిశాయి. ఎంపికైన వారికి మంగళవారం జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు నియామకపత్రాలను అందించారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

పోరుమామిళ్ల : పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో సోమవారం పైప్‌లైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. వేసవిలో ప్రజలు నీటికి ఇబ్బంది పడరాదనే భావనతో సర్పంచ్ సుధాకర్ వెంటనే స్పందించి మంగళవారం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి, నీటి సరఫరా పునరుద్ధరించారు. సుధాకర్ మాట్లాడుతూఎక్కడ ప్రజలకు ఇబ్బంది ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకుస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కలిసికట్టుగా పనిచేస్తాం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ టికెట్ ఆశించేవారు ఏడుగురు ఉన్నారని, ఎవరికి ఇచ్చినా కలసికట్టుగా పనిచేస్తామని తెలుగుదేశం నాయకుడు సీఎం సురేష్‌నాయుడు తెలిపారు. పట్టణంలోని వీఎస్ ముక్తియార్ నివాసంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తనతో పాటు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, మల్లేల లింగారెడ్డి, వీఎస్ ముక్తియార్, మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి, సినీహబ్ రాజేశ్వరరెడ్డిలు టీడీపీ టికెట్ రేసులో ఉన్నట్లు చెప్పారు. వీరిలో ఎవరికి టికెట్ వచ్చినా అందరం కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. ఇక్కడ టీడీపీని గెలిపించడమే తమ ధ్యేయమని అన్నారు. ఇక నుంచి ప్రొద్దుటూరులో టీడీపీ తరపున క్రియాశీలకంగా పని చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


1998 టీచర్స్ అసోసియేషన్ (ఎంపీఎస్) నూతన కార్యవర్గం

ప్రొద్దుటూరు : జిల్లా డీఎస్సీ 1998 టీచర్స్ అసోసియేషన్ (ఎంపీఎస్) నూతన కార్యవర్గాన్ని మంగళవారం సాయంత్రం స్థానిక గాంధీ పార్కులో ఎన్నుకున్నారు. 1998లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వీరిని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం గుర్తించి ఇటీవల ఉద్యోగాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన వీరు తొలిమారు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పులివెందులకు చెందిన ముడియం మహేశ్వర రెడ్డి, సహాయ కార్యదర్శిగా ప్రొద్దుటూరుకు చెందిన బుర్రయ్యగారి రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా భోగాల గురివిరెడ్డి, కోశాధికారిగా జి.శ్రీధర్‌రెడ్డి, సలహాదారుడుగా జి.గోపాల్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు బి.సాంబశివారెడ్డిలను ఎన్నుకున్నారు.

ఆర్‌ఎస్‌ఏ జిల్లా కమిటీ రద్దు

ప్రొద్దుటూరు : రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఆర్‌ఎస్‌ఏ) జిల్లా కమిటీని రద్దు చేసినట్లు అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బి.ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు, మీడియా సంస్థలు, గమనించాలని ఆయన కోరారు. నూతన కమిటీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బ్రహ్మంగారిమఠం : మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ వెంగమునిరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని తెలిపారు.

విద్యుత్ బకాయిల వసూళ్ల వేగం పెంచండి


ఎస్‌ఈ రమణ

మైదుకూరు : డివిజన్‌లో బకాయిల వసూళ్ల వేగాన్ని పెంచాలని ఏపీఎస్పీడీసీఎల్ నూతన ఎస్‌ఈ రమణ అన్నారు. మంగళవారం మైదుకూరులోని డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో నిరంతర విద్యుత్ సరఫరా అమలు చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు అప్రమత్తతతో పని చేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులను ఎప్పటికప్పుడు ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న డీఈఈ జీవీ రామిరెడ్డి మాట్లాడుతూ కలసపాడు సెక్షన్‌లో మార్చి 17వ తేదీ ఎనర్జీ అసిస్టెంట్ సురేష్ ప్రమాదానికి గురైన సంఘటనలో, గత నెల 30న కె.హరి అనే ఎనర్జీ అసిస్టెంట్ ప్రమాదానికి గురైన సంఘటనలో కలసపాడు సెక్షన్‌లో పని చేస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీరాములు, లైన్‌మెన్ ఎ.కుమార్‌బాబులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఏఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రెండో కారుకు నీరందించాం

- గత ప్రభుత్వ హయాంలో నీటిని కేటాయించాలంటూ ధర్నా చేయాల్సిన దుస్థితి ఉండేది
- నేడు ఆయకట్టు రైతులకు ఏప్రిల్ వరకు నీరు ఇచ్చాం
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : గత 60 ఏళ్ల చరిత్రలో కేసీ కెనాల్ ఆయకట్టులో రెండో కారుకు పూర్తి స్థాయిలో సాగునీరు ఇచ్చిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదేనని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ లక్షుమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కేసీ ఆయకట్టుకు సాగునీరు రావాలంటే ధర్నాలు చేసి తెచ్చుకొనేవారమని.. తాను, జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలందరూ ప్రతి ఏటా కేసీ కెనాల్ సాగునీటి కోసం జాతీయ రహదారులపై ధర్నాలు చేసేవాళ్లమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఏటా రెండు కార్లకు సంవృద్ధిగా సాగునీరు అందుతోందన్నారు. ఈ ఏడాది రెండో కారు మార్చి వరకు నీరిస్తామని చెప్పటినప్పటికీ మరో నెల అదనంగా ఏప్రిల్ చివరి వరకు సాగునీరు ఇచ్చామన్నారు. ఎన్నడూ లేని విధంగా రెండో కారులోనూ ఎకరాకు 4 – 5 పుట్లు వరిధాన్యం పండిందన్నారు. గతేడాది పంట బీమా పథకంలో భాగంగా మండలానికి రూ.29 కోట్లు రైతులకు వచ్చిందన్నారు. నిరుద్యోగులు, రైతు మిత్ర గ్రూపులకు పురుగుల మందు పిచికారి చేసేందుకు ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో డ్రోన్లు అందిస్తోందని వీటిని వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందన్నారు. నక్కలదిన్నెలో త్వరలోనే రూ.3 కోట్లతో రెండో పీహెచ్‌సీ పూర్తవుతుందన్నారు. జూన్ నెలాఖరుకు గ్రామాల్లో డ్రైనేజీ సమస్యలు లేకుండా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభకరుణమ్మ, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఏఓ మ్యాగీ, ఎంఈఓ రవిశంకర్, పంచాయతీరాజ్ ఏఈ ఈశ్వరయ్య, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

సభ మధ్యలోనే వెళ్లిపోయిన తహసీల్దారు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తహసీల్దారు సుభానీ సభ మధ్యలోనే వెళ్లిపోయారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరై గంటకు పైగా ప్రజల సమస్యలు తెలుసుకుని అనివార్య కారణాల రీత్యా ఎమ్మెల్యే వెళ్లారు. కానీ సమావేశంలో రెవెన్యూ శాఖ అంశంపై చర్చకు రాక మునుపే తహసీల్దారు సభ నుంచి వెళ్లిపోవటం చర్చనీయాంశంగా మారింది. రెవెన్యూ పరమైన సమస్యలను సభా దృష్టికి తీసుకురావాలని అనుకున్నప్పటికీ తహసీల్దారు సభ నుంచి వెళ్లిపోవటంపై ప్రజాప్రతినిధులు విమర్శలు చేస్తున్నారు. దీనిపై ఎంపీడీఓ శ్రీధర్ నాయుడును వివరణ కోరగా సభ పూర్తయ్యే వరకు ఉండాలని సభ జరిగే సమయంలో మధ్యలో తహసీల్దారు వెళ్లిపోవటంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

మంచి చేశాం.. ఇంటింటికి వెళ్లగలుగుతున్నాం


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పట్ల ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మైదుకూరులోని 15వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు తెచ్చి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. లేదంటే తాము ఇంటింటికి వెళ్లగలగేవాళ్లం కాదన్నారు. రూ. 6 కోట్లతో సీసీ రోడ్లు, రూ. 8 కోట్లతో బీటీ రోడ్లు, రూ. 9 కోట్లతో డ్రైనేజీలు నిర్మించనున్నామని వివరించారు.

ప్రజా సర్వేకు పోదామా !

ప్రజల్లో పెల్లుబిక్కుతున్న అభిమానాన్ని చూసి ఓర్వలేక టీడీపీ వారు లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆరోపించారు. వారి విమర్శలకు సమాధానం ఒక్కటే ఏ ప్రభుత్వంలో ఏ మేలు జరిగిందో ప్రజలనే అడుగుదామని తెలిపారు. ఇందు కోసం సర్వే చేయిద్దాం.. దమ్ముంటే రండని సవాల్ విసిరారు. టీడీపీ హయాంలో పనులు చేయకుండానే బిల్లులు చేసుకొని ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి, ఇప్పుడు ఎక్కడో ఓ చోట చిన్న గుంత కనిపిస్తే విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ వై.రంగస్వామి, ఏఈ నిరంజన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి కె.శ్రీనురావు, కలిడి రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మహిళా అధ్యక్షురాలు కిరణ్మయి, ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, కూశెట్టి రాయుడు, భూమిరెడ్డి సుబ్బరాయుడు, మైనార్టీ నాయకులు ఖాదర్, జమాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, కో–ఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

ఎమ్మెల్యే డాక్టర్ సుధ


అంబవరం గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా సమర్థవంతంగా పాలించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం. ఈ సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రామచంద్రాపురం, అంబవరం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుండి పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలకాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశ్యంతోనే జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభించారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి రూ.లక్షకు పైగా లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, ప్రభాకర్‌రెడ్డి, పీరావలి, జిలాని, శేఖర్, రామచంద్ర, మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే 'జగనన్నకు చెబుదాం'


నరసాపురం ఆర్బీకేలో జగన్ ప్రసంగాన్ని వింటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న వారికి సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతోనే జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారని జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నరసాపురం రైతుభరోసా కేంద్రంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరయ్యారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, మండల కన్వీనర్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతిఒక్కరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎవరైనా అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారు 1902 కు కాల్ చేసి తెలిపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రామచంద్రుడు, ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలకు వడ్డీలేని రుణాలు పంపిణీ


రుణాలను అందిస్తున్న ఇమామ్ ఆరిఫుల్లాహ్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జిన్నా రోడ్డులోని ఖిద్మత్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా వడ్డీలేని రుణాలను మంగళవారం పంపిణీ చేశారు. లైన్ మసీదు ఇమామ్ ఆరిఫ్ వుల్లాహ్ చేతుల మీదుగా రుణాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డీల బారి నుంచి ప్రజలను రక్షించడానికి జమా అతె ఇస్లామి హింద్ ఖిద్మత్ సొసైటీని స్థాపించి పేదలకు రుణాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. పేద ప్రజలు రుణాలను సద్వినియోగం చేసుకుని తిరిగి చెల్లించాలని కోరారు. అనంతరం 31 మంది పేదలకు రూ.10లక్షల రుణాలను పంపిణీ చేశారు. జమా అతె ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్ అహ్మద్, పట్టణాధ్యక్షుడు మహబూబ్ షరీఫ్, బీఎంసీ అధ్యక్షుడు షేక్ సలీం, ఖిద్మత్ బ్రాంచి మేనజర్ ఇంతియాజ్ అహ్మద్, క్యాషియర్ రఫీ పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితం

ప్రొద్దుటూరు క్రైం : ఆసుపత్రుల్లో కాన్పులు కావడం ఎంతో సురక్షితమని డాక్టర్ సుస్మిత తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కామనూరు పీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లోని గర్భిణులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గర్భిణులు అన్ని రకాల ఆకు కూరలు, మాంస కృత్తులు, ఖనిజ లవణాలు, విటమిన్స్, ప్రోటీన్‌లు కలిగిన ఆహారం తీసుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ భోజన వసతి కల్పించారు. సీహెచ్‌ఓలు గంగతులసి, కృష్ణమ్మ, హెచ్‌ఈ శోభారాణి, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, స్టాఫ్ నర్సులు విజయమమ్మ, సుబ్బమ్మ, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీనారాయణమ్మ, నాగసుహాసిని ఎల్‌టీ ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా ఏఐటీయూసీ నిరసన


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో మంగళవారం రెజ్లర్లకు మద్దతుగా ఏఐటీయూసీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ మహిళా క్రీడాకారుల పట్ల బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని జాతీయస్థాయి రెజ్లర్లు ఆరోపిస్తూ ఆందోళన చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ సమస్యను పరిష్కరించాల్సిందిపోయి ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై పోలీసులచే లాఠీచార్జి చేయించడం దారుణమన్నారు. బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ నాయకులు యేసోబ్, హరి, మీరావాలి, బాషా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

బ్రహ్మంగారిమఠం : మండలంలో ఉన్న భూ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం పలువురు భూ సమస్యలపై తహసీల్దార్‌కు వినతి పత్రాలు సమర్పించడంతో ఆయన మాట్లాడుతూ బి.మఠం మండలంలో అధికంగా ప్రభుత్వ భూముల సమస్యలు ఉన్నాయన్నారు. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్‌మెంట్ భూములలో కొంతమంది అనధికారకంగా ఆన్‌లైన్ చేయించుకున్నట్లు ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. అటువంటి భూ సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. బద్వేల్ – మైదుకూరు రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులు, ఇంటి యజమానులు పూర్తిగా తమదగ్గర ఉన్న పత్రాలు రెవెన్యూ అధికారులకు చూపాలన్నారు. సిబ్బంది సరిగా స్పందించకపోతే నా దృష్టికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. ఆర్డీఓ, జేసీ, కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ప్రతిభా విద్యార్థులకు నగదు బహుమతులు


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తావిజయ ప్రతాప్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరిలో పాఠశాల సందర్శనకు వచ్చిన సమయంలో పది పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు రూ.10 వేలు నగదు బహుమతి అందజేస్తానని ప్రకటించారన్నారు. అందులో భాగంగా పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్.వెంకటశివ, ద్వితీయ స్థానంలో నిలిచిన జి.మెర్సీరాణి, తృతీయ స్థానంలో నిలిచిన నవనీశ్వర్‌రెడ్డి, మహమ్మద్‌హబీబ్‌లకు విజయప్రతాప్‌రెడ్డి తరపున నగదు బహుమతులను అందజేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని పునరుద్ధరించాలి

బద్వేలు అర్బన్ : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీసీఈ) పదవ తరగతి పాఠ్యాంశాల్లోని డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని పునరుద్ధరించాలని కోరుతూ మంగళవారం స్థానిక సుందరయ్య భవనం ఆవరణలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక పట్టణ కన్వీనర్ కె.శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబులు మాట్లాడుతూ సైన్స్ ప్రాథమిక ఆవిష్కరణ గురించి విద్యార్థులకు తెలియకపోతే వారి ఆలోచన ధోరణి కుంటుపడుతుందని అన్నారు. పరిణామ జీవశాస్త్రాన్ని అర్థం చేసుకోవడం, దానిపై పట్టు సాధించడం, జీవశాస్త్రంలోని ఉప శాఖలకు చాలా ముఖ్యమని, అటువంటి పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆలోచించి డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని, పట్టణ నాయకులు ప్రవీణ్‌కుమార్, నాగార్జున, రమణారెడ్డి, మహిళా కన్వీనర్ గురుదేవి, సీఐటీయూ పట్టణ నాయకులు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం... చక్రస్నానం

ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు


కుందూనదిలో చక్రస్నానం చేస్తున్న అర్చకులు, భక్తులు

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని వెల్లాల గ్రామంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు తొమ్మిదో రోజు మంగళవారం హంస వాహనం (వసంతోత్సవం) అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ఉత్సవ విగ్రహాలైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాముల విగ్రహాలను హంస వాహనంపై ఊరేగించారు. ప్రత్యేక పూజలు చేశాక అక్కడ నుంచి నేరుగా నవధాన్యాల మొలక తీసుకొని కుందూనది వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహమూర్తులకు స్నపనము గావించి చక్రస్నానం చేశారు.అక్కడకు వచ్చిన భక్తులంతా కుందూనదిలో చక్రస్నానం ఆచరించారు. ముందుగా వసంతోత్సవం సందర్భంగా అందరూ రంగునీళ్లు చల్లుకున్నారు. అక్కడకు వచ్చిన వారందరికి సంజీవరాయ కల్యాణ మండపం, అన్నదాన సత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, సర్పంచ్ కానాల రాధ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, ఈఓ నరసయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, రాజారెడ్డి, రామచంద్రారెడ్డి, జయరామిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కమిటీ సభ్యులు, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, అర్చకులు పాల్గొన్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ధ్వజా అవరోహణంతో ముగిశాయి.

వేసవి శిబిరంపై విద్యార్థుల ఆసక్తి


కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పోరుమామిళ్ల : స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరంపట్ల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థులకు సెలవులు కావడంతో గ్రంథాలయం వారికి చక్కని వినోద, విజ్ఞాన సాధనంగా కనిపించింది. మంగళవారం భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి బుధవారం కథల పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నీతి కథలు, పురాణ కథలతో పాటు విద్యార్థులకు ఆసక్తి ఉన్న కథలను అందరికీ అర్థమయ్యే రీతిలో చెప్పాలన్నారు. బహుమతులు ఇస్తామన్నారు. మంగళవారం ఉపాధ్యాయుడు మహమ్మద్ రఫీ క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రెజ్లర్లపై లైంగికంగా వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌తో సహా కోచ్‌లు తమను ఏళ్ల తరబడి లైంగికంగా వేధిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని మహిళా రెజ్లర్లు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నారన్నారు. నిరసన కారులపై మే 3న అర్ధరాత్రి పోలీసులు లాఠీ చార్జి చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు వరలక్ష్మి, పద్మావతి, తేజస్విని, సురేష్‌బాబు, సుధాకర్, సృజన శ్రీను, లక్ష్మీదేవి, మహమూద్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.నాగరాజు


వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కె.నాగరాజు

బద్వేలు అర్బన్ : ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు పేర్కొన్నారు. స్థానిక తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ వందన కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా ఏర్పాటుచేసిన సురక్షిత మాతృత్వ వందన కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని కోరారు. ప్రభుత్వాసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత పరీక్షలతో పాటు సురక్షితంగా ప్రసవాలు జరుగుతాయనే విషయంపై గర్భిణులకు అవగాహన కల్పించాలని కోరారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి తగిన సూచనలు ఇవ్వడంతో పాటు సకాలంలో మందులు అందజేయాలని కోరారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు పది ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సురక్షిత ప్రసవం కోసం 108 వాహనాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్నస్వర్ణలత, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఆరోగ్య విస్తరణాధికారులు ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.